క్లుప్తంగా

ముదిరాజ్‌లకు అధిక సీట్లు కేటాయించాలి

కాచిగూడ: ముదిరాజ్ కులస్తులను గుర్తించి వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో సీట్లు కేటాయించిన పార్టీలకే ముదిరాజ్‌ల మద్దతు ఉంటుందని తెలంగాణ మన ముదిరాజ్ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ చొప్పరి శంకర్ ముదిరాజ్ అన్నారు. ఆదివారం నారాయణగూడలో ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్ పార్టీ ముదిరాజ్‌లకు ఒక్క సీటు కూడా ఇవ్వకుండా పూర్తి నిర్లక్ష్యం చేస్తోందన్నారు. బీజేపీ, కాంగ్రెస్ పార్టీలైనా ముదిరాజ్‌లకు జనాభా ప్రాతిపదికన సీట్లు కేటాయించాలన్నారు. తెలంగాణ మన ముదిరాజ్ మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షులుగా పిట్ల నాగేష్, పల్లెపాటి సత్యనారాయణ, అధికార ప్రతినిధిగా తోడంగి స్వామిలను నియమిస్తూ వారికి నియామక పత్రాలను అందజేశారు.

జాతీయ కరాటే చాంపియన్‌షిప్ పోటీలు



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి

కాచిగూడ: సామురాయ్ ప్రొఫెషనల్ కరాటే ఆధ్వర్యంలో సెప్టెంబర్ 3న జాతీయ ఓపెన్ కరాటే అండ్ కుంగ్ ఫూ చాంపియన్ షిప్ పోటీలను నిర్వహిస్తున్నట్లు సంస్థ వ్యవస్థాపకులు సిద్దార్థ్‌షా ప్రకటించారు. ఆదివారం పోటీల పోస్టర్‌ను బర్కత్‌పురలోని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి నివాసంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఇండివిజల్ కట, టీమ్ కట, కుమితే, వెపన్ కట, కుంగ్‌ఫూ ఫారమ్స్, సిలంబమ్ తదితర విభాగాల్లో పోటీలు ఉంటాయన్నారు. ఈ పోటీలకు కేంద్రమంత్రి ముఖ్యఅతిథిగా పాల్గొంటారన్నారు. వివరాలకు సెల్ 9014683181.

అవార్డు ప్రదానం



అవార్డును అందజేస్తున్న ఆర్.కృష్ణయ్య

కాచిగూడ: బీసీల సమస్యలపై ఉద్యమిస్తూ గత 30 ఏళ్లుగా అనేక సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జకృష్ణకు ఉత్తమ సామాజిక సేవ కార్యకర్త అవార్డును జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ ఎంపీ ఆర్.కృష్ణయ్య ఆదివారం అందజేశారు. బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వేముల రామకృష్ణ ఈ అవార్డును అందుకున్న వారిలో ఉన్నారు.

సంస్కారం నేర్పని విద్య సమాజానికి నష్టం



స్వామి శితికంఠానంద, ప్రిన్సిపాల్ శ్రవణ్‌కుమార్

చిక్కడపల్లి: ప్రస్తుతం మన విద్యావిధానం కేవలం ధనసంపాదనకు మాత్రమే అన్నట్లు రూపొందించారని దీనివల్ల విద్యార్థులలో సంస్కారం లోపిస్తోందని రామకృష్ణమఠం ప్రతినిధి శితికంఠానంద స్వామీజీ అన్నారు. చిక్కడపల్లి త్యాగరాయగానసభ ప్రధాన వేదికపై ఆదివారం సెయింట్ ఆడమ్స్ హైస్కూల్ నిర్వహణలో తల్లిదండ్రులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రధాన వక్తగా హాజరై స్వామీజీ మాట్లాడారు. పిల్లల్లో ఉన్న ప్రతిభను గుర్తించి వెలుగులోకి తీసుకొచ్చే బాధ్యత తల్లిదండ్రులదేనన్నారు. పిల్లలకు ర్యాంకులే కాకుండా నైతిక విలువలను నేర్పాలన్నారు. స్కూల్ ప్రిన్సిపాల్ శ్రవణ్‌కుమార్, ప్రభాకర్‌రావు తదితరులున్నారు. ఉచ్ఛారణ పోటీల్లో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు.

కార్మికుడి అదృశ్యం



సోమయ్య (ఫైల్)

చిక్కడపల్లి: పనికోసం ఇంటి నుంచి వెళ్లిన ఓ కార్మికుడు అదృశ్యమైన ఘటన దోమలగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్సై ఎస్.సాయికృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. దోమలగూడ గాంధీ విగ్రహం వద్ద నివాసం ఉంటున్న గుల్ల సోమయ్య(60) కుమారుడు ప్రవీణ్‌తో కలసి ఉంటున్నాడు. ఇప్పటిలాగే ఈనెల 20న చిక్కడపల్లి లేబర్ అడ్డాకు పనికోసం వెళ్లి తిరిగి రాలేదు. ఆచూకీ కోసం బంధువులు, పలుచోట్ల వాకబు చేసినా ఫలితం లేకపోవడంతో కుమారుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సోమయ్యకు బదిరీ వైకల్యం ఉందని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆలయాల అభివృద్ధికి కృషి

- రూ.5 లక్షల సొంత నిధులతో కమాన్ పనులకు శంకుస్థాపన
- ప్రతినెల 15 మంది అర్చకులకు వేతనాల చెల్లింపు



ఆలయ కమాన్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

నల్లకుంట: నియోజకవర్గంలోని అన్ని ఆలయాల అభివృద్ధి, మౌలిక వసతులు కల్పించేందుకు నిరంతరం కృషి చేస్తున్నానని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ తెలిపారు. ఆదివారం నల్లకుంట డివిజన్ పరిధిలోని గోల్నాక చర్చిలైన్‌లో రూ. 5 లక్షల సొంత నిధులతో నూతనంగా చేపట్టనున్న నల్ల పోచమ్మ ఆలయ కమాన్ నిర్మాణ పనులకు ఎమ్మెల్యే కాలేరు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. నియోజక వర్గంలోని అన్ని ప్రాంతాల్లో ఉన్న దేవాలయాల్లో భక్తులకు మెరుగైన సదుపాయాలు కల్పించేందుకు తోచిన విధంగా సొంత నిధులతో అభివృద్ధి పనులు చేపడుతున్నానన్నారు. ఆయా దేవాలయాల్లో అర్చకత్వం నిర్వహిస్తున్న 15 మంది నిరుపేద అర్చక స్వాములకు ప్రతి నెల పారితోషకాలు అందజేస్తున్నానని వివరించారు. బీఆర్ఎస్ పార్టీ నల్లకుంట డివిజన్ అధ్యక్షుడు మేడి ప్రసాద్, పార్టీ సీనియర్ నాయకులు గోనే ప్రదీప్‌రావు, గెల్వయ్య, భాస్కర్ గౌడ్, గాలపల్లి శంకరయ్య, ఇర్ఫాన సుల్తానా, కూర నరేందర్, క్రిసోలైట్, పోచమ్మ ఆలయ కమిటీ ప్రతినిధులు, బస్తీ వాసులు పాల్గొన్నారు.



చర్చిలేన్ సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

సన్మానం

నల్లకుంట: పోచమ్మ ఆలయ కమాన్ నిర్మాణానికి బీఆర్ఎస్ సీనియర్ నేత గోనే ప్రదీప్‌రావు ప్రత్యేక చొరవ తీసుకుని కమాన్‌ను నిర్మించారు. ఆయన తన సొంత ఖర్చుతో కమాన్ నిర్మాణానికి కృషి చేసినందున ఆదివారం అమ్మవారి ఆలయం వద్ద ఎమ్మెల్యే కాలేరు కాలేరు వెంకటేష్ ఆధ్వర్యంలో ప్రదీప్‌రావును శాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పోచమ్మ ఆలయ కమిటీ ప్రతినిధులు, బస్తీ వాసులు పాల్గొన్నారు.

అర్హులు ఓటరుగా నమోదు చేసుకోవాలి



ఓటరు నమోదును పరిశీలిస్తున్న జీహెచ్‌ఎంసీ అడిషనల్ కమిషనర్



పరిశీలిస్తున్న కార్పొరేటర్ పద్మావెంకట్‌రెడ్డి

అంబర్‌పేట: ఓటరు జాబితాను రూపొందించేందుకు జీహెచ్ఎంసీ పటిష్ట చర్యలు తీసుకుంటుందని జీహెచ్ఎంసీ అడిషనల్ కమిషనర్ శంకరయ్య తెలిపారు. ఆదివారం అంబర్‌పేట సర్కిల్ వ్యాప్తంగా ఉన్న అన్ని పోలింగ్ కేంద్రాల్లో జీహెచ్ఎంసీ సిబ్బంది కొత్తగా ఓటరు నమోదు, సవరణ కార్యక్రమాన్ని ప్రత్యేకంగా చేపట్టారు. ఈ కార్యక్రమాన్ని అంబర్‌పేట సర్కిల్ డిప్యూటీ మున్సిపల్ కమిషనర్ మారుతి దివాకర్‌తో కలిసి పలు పోలింగ్ కేంద్రాలను ఆయన పరిశీలించారు. కొత్తగా నమోదవుతున్న ఓటర్ల సరళి, సవరణ వివరాలను ఆయన సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అర్హులైన వారు ఓటరు జాబితాలో కొత్తగా పేర్లు నమోదు చేసుకోవాలని ఆయన కోరారు. ఎలాంటి ఇబ్బందులున్నా.. తమ సిబ్బంది దృష్టికి తీసుకొస్తే పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటామన్నారు. జీహెచ్ఎంసీ అధికారులు శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

లోపాలను సవరించండి

అంబర్‌పేట: ఓటరు జాబితాలో కొత్తగా ఓటరుగా నమోదయ్యేలా జీహెచ్ఎంసీ విస్తృత ప్రచారం చేపట్టాలని బాగ్అంబర్‌పేట డివిజన్ కార్పొరేటర్ పద్మా వెంకట్‌రెడ్డి తెలిపారు. ఓటరు నమోదు కోసం ఆదివారం జీహెచ్ఎంసీ అధికారులు చేపట్టిన ప్రత్యేక కార్యక్రమాన్ని ఆమె పలు పోలింగ్ కేంద్రాల్లో పరిశీలించారు. ఓటరుగా నమోదు కావడానికి కావాల్సిన వివరాలు, సేవలను ప్రజలకు వివరించాలని ఆమె అధికారులను కోరారు. జాబితాలో ఉన్న లోపాలను కూడా సాధ్యమైనంత త్వరగా పరిష్కరించాలని ఆమె సూచించారు. జీహెచ్ఎంసీ అధికారులు, స్థానిక బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య సేవలు అభినందనీయం

కాచిగూడ: పేదలను ఆదుకొనేందుకు హిందూ శ్మశాన ప్రబంధక సమితి చేస్తున్న కృషి అభినందనీయమని లోకాయుక్త జస్టిస్ సీవీ రాములు అన్నారు. 'మానవ సేవయే మాధవసేవ'గా భావించి వివిధ విభాగాల్లో ఉచిత సేవలు అందిస్తూ.. హిందూ శ్మశాన ప్రబంధక సమితి అందరికి ఆదర్శప్రాయంగా నిలుస్తోందన్నారు. ప్రబంధక సమితి ఆధ్వర్యంలో కాచిగూడలో నిర్వహిస్తున్న ప్రసన్నాంజనేయ స్వామి సేవ క్లినిక్ ద్వితీయ వార్షికోత్సవ వేడుకలు ఆదివారం సమితి అధ్యక్షుడు ఎస్.గోపాల్‌రావు అధ్యక్షతన ఘనంగా జరిగాయి. ఆయన మాట్లాడుతూ.. గత రెండేళ్ల నుంచి జనరల్ వైద్యం, ఫిజియోథెరఫీ వైద్యం, యోగా, టైలరింగ్, మెహిందీ, మగ్గం తదితర విభాగాల్లో ప్రజలకు ఉచిత సేవలతో పాటు అవసరమైన వారికి ఉచితంగా మందులు అందిస్తోందన్నారు. ఇప్పటి వరకు ఉచితసేవల కోసం రూ. 23 లక్షలకు పైగా ఖర్చుచేశామన్నారు. వివిధ విభాగాల్లో శిక్షణ పొందిన మహిళలకు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. ఈ శిబిరంలో జనరల్, కంటి, డెంటల్, ఫిజియోథెరఫీలో రోగులకు అవసరమైన వారికి ఉచితంగా మందులతో పాటు కళ్లద్దాలను పంపిణీ చేశారు. సరస్వతి ఉపాసకులు దైవజ్ఞశర్మ, ప్రబంధక సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ రాజ్‌కుమార్ విగ్, ప్రధాన కార్యదర్శి వీరస్వామి, విజయ్‌కుమార్, నందకిషోర్‌యాదవ్, డాక్టర్ కొండా శ్రీనివాస్‌రావు తదితరులున్నారు.



మాట్లాడుతున్న లోకాయుక్త జస్టిస్ సీవీ రాములు

పేదలు నివసిస్తున్నచోటే ఉచిత వైద్య సేవలు..

ముషీరాబాద్: కార్పొరేట్ వైద్య సంస్థలు మానవతా దృక్పదంతో పేద ప్రజలు నివసించే ప్రాంతాల్లో ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని ముషీరాబాద్ కార్పొరేటర్ సుప్రియానవీన్‌గౌడ్ కోరారు. ఆదివారం ముషీరాబాద్ జీహెచ్ఎంసీ వార్డు కార్యాలయంలో షైన్ నర్సింగ్ హోం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత మెగా హెల్త్ క్యాంపును ఆమె ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. నియోజకవర్గంలో అధికంగా పేదలు నివసిస్తున్నారని వారికి మెరుగైన వైద్యసేవలు అందించేందుకు స్వచ్ఛంద సంస్థలు, ప్రైవేటు వైద్య సంస్థలు ముందుకు రావాలన్నారు. ఈ సందర్భంగా అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఎం.నవీన్‌గౌడ్, బద్రినారాయణ, కంచి కుమార్, అనిల్ కుమార్, సత్యనారాయణ, డాక్టర్ అర్జున్, దీన్‌దయాల్, అంకిత్, సూరజ్, ప్రసన్నలక్ష్మి, నవీన్, కృష్ణప్రియ తదితరులున్నారు.

దోపిడీకి వ్యతిరేకంగా పోరాటమే గద్దర్‌కు నివాళి



గద్దర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న డాక్టర్ చెరుకు సుధాకర్, ప్రొ. కంచె ఐలయ్య

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: కుల నిర్మూలన, దోపిడీకి వ్యతిరేకంగా పోరాటం చేయడమే గద్దర్‌కు నిజమైన నివాళి అని పలువురు వక్తలు అన్నారు. ఆదివారం రాత్రి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో విముక్తి చిరుతల కచ్చి(వీసీకే) తెలంగాణ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ప్రజా గాయకుడు గద్దర్ సంస్మరణసభ ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా తెలంగాణ జన సమితి అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరామ్, ప్రొఫెసర్ కంచె ఐలయ్య, డాక్టర్ చెరుకు సుధాకర్, ప్రముఖ నాయకుడు, రచయిత జయరాజులు మాట్లాడుతూ.. తాడిత, పీడిత ప్రజలను చైతన్యం చేసేందుకు గద్దర్ తన గళాన్ని ఉపయోగించారన్నారు. ఆయన ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. డాక్టర్ జిలుకర శ్రీనివాస్, ప్రజా గాయని విమలక్క, బీసీకే వర్కింగ్ ప్రెసిడెంట్ మచ్చ దేవేందర్, శంకర్, దాసోజు లలిత, నల్లా సూర్యప్రకాష్, కోట శ్రీను, జమున పాల్గొన్నారు.

దరఖాస్తులకు ఆహ్వానం

చిక్కడపల్లి: డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పరస్కరించుకుని సాంస్కృతిక సేవా సంస్థ ఆధ్వర్యంలో ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలు ప్రదానం చేయనున్నట్లు సంస్థ కన్వీనర్ జి.విజయ్‌కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. విద్యారంగంలో విశేష కృషి చేసిన బోధన రంగంలో అన్ని కేటగిరీలకు చెందిన వారు దరఖాస్తు చేసుకోవచ్చని ఆయన సూచించారు. ఆసక్తిగల వారు ఈ నెల 31వ తేదీలోపు 9391379903 నంబరుకు వాట్సప్‌కు వివరాలు అందజేయాలని కోరారు.

దళితులకు సీఎం పదవి ఇవ్వాలి

కాచిగూడ: కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ పార్టీలు దళితులకు సీఎం పదవీ అప్పగించాలని ధర్మ సమాజ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ విశారదన్ మహరాజ్ అన్నారు. ఆదివారం బర్కత్‌పురలోని పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. చేవెళ్ల డిక్లరేషన్ చేసిన కాంగ్రెస్ పార్టీపై తిరగబడాలని, బీజేపీ, బీఆర్ఎస్ తదితర పార్టీలపై కూడా విమర్శలు చేశారు. సీఎం పదవీ అప్పగించకుంటే ఆయా పార్టీల నేతలను గ్రామాల్లో తిరగనివ్వమని హెచ్చరించారు.

గంగపుత్రులకే ప్రాధాన్యం ఇవ్వాలి



సత్యనారాయణ

కాచిగూడ: వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో అంబర్‌పేట ఎమ్మెల్యే సీటు అధిక శాతం జనాభా కలిగిన గంగపుత్రులకే కేటాయించి అభివృద్ధికి తోడ్పడే అవకాశం కల్పించాలని గంగపుత్ర చైతన్య సమితి రాష్ట్ర స్టీరింగ్ కమిటీ చైర్మన్ పూస సత్యనారాయణ డిమాండ్ చేశారు. స్థానిక అంబర్‌పేట గంగపుత్రులను అన్ని రాజకీయపార్టీలు చిన్న చూపు చూస్తూ.. కేవలం ఓటుబ్యాంక్‌గా మాత్రమే వాడుకుంటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈసారైనా గంగపుత్రులకు సీటు ఇస్తే అధిక మెజారిటీతో గెలిపించి అసెంబ్లీకి పంపిస్తామన్నారు.

సామాన్యులకు అర్థమయ్యేలా గజల్ సాహిత్యం



సుందరయ్య విజ్ఞాన కేంద్రం: విశ్వపుత్రిక గజల్ ఫౌండేషన్ వార్షికోత్సవం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఘనంగా జరిగింది. ఆదివారం జరిగిన ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న పద్మశ్రీ కొలకలూరి ఇనాక్ మాట్లాడుతూ.. సాధారణ ప్రజలకు సైతం అర్థమయ్యే భాషలో గజల్ సాహిత్యం ఉంటుందన్నారు. ఇలాంటి గజల్ కళాకారులను ప్రోత్సహించేందుకు ఫౌండేషన్ చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. బిక్కి కృష్ణ, ప్రముఖ గజల్ కళాకారుడు డాక్టర్ గజల్ శ్రీనివాస్, విశ్వపుత్రిక గజల్ ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ పి.విజయలక్ష్మిపండిత్, రామసత్యనారాయణ, నాలేశ్వరం శంకరం, డాక్టర్ విద్యాధర్‌రావు, దేవదాస్, స్వరూపరాణి జోతిర్మయి తదితరులు పాల్గొన్నారు.

కనుల పండువగా సుదర్శన నృసింహ హోమం

ముషీరాబాద్: అడిక్‌మెట్ డివిజన్ రాంనగర్ రామాలయంలో శ్రీ సుదర్శన నృసింహ హోమం కన్నుల పండువగా జరిగింది. ఆదివారం ఆలయ ప్రధాన అర్చకులు ఎ.వెంకటరమణాచార్యులు, ఎం.వేణు గోపాలచార్యులు, కె.ప్రసాద్‌శర్మలు హోమం నిర్వహించారు. రాంనగర్ పరిసర ప్రాంతాల భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఎమ్మెల్యే ముఠా గోపాల్, బీఆర్ఎస్ యువనేత ముఠా జైసింహ దంపతులు హోమంలో పాల్గొని పూజలు చేశారు. ఆలయ కమిటీ చైర్మన్ డి.రవియాదవ్, ధర్మకర్తలు ఎ.శ్రీనివాస్, కె.శ్రీధర్‌రెడ్డి, కె.రజనీ, కె.గోవర్ధన్‌యాదవ్, గోవర్ధన్‌రెడ్డి తదితరులున్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి..

విద్యానగర్‌లో డ్రైనేజీ, రోడ్లు, వీధిదీపాలు, తాగునీటి సమస్యల పరిష్కారానికి త్వరలో చర్యలు చేపడతామని ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. అపార్ట్‌మెంట్ వాసుల సమస్యల పరిష్కారానికి పాటుపడతామన్నారు. ఆదివారం బీఆర్ఎస్ నాయకుడు ఎం.డీ.ఖదీర్ ఆధ్వర్యంలో బస్తీబాట కార్యక్రమం జరగగా.. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బస్తీ వాసుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ముచ్చకుర్తి ప్రభాకర్, కె.సురేందర్, అబ్బు షేక్ మహ్మద్, శంకర్‌ముదిరాజ్ తదితరులున్నారు.



ఎమ్మెల్యే ముఠా గోపాల్, ఆలయ కమిటీ చైర్మన్ రవియాదవ్

బీఆర్ఎస్‌తోనే పేదల అభ్యున్నతి



బీఆర్ఎస్‌లోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే కాలేరు



బాపూజీనగర్‌లో బీఆర్ఎస్‌లోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్

అంబర్‌పేట: అభివృద్ధి, సంక్షేమం బీఆర్ఎస్‌తోనే సాధ్యమవుతుందని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ తెలిపారు. ఆదివారం అంబర్‌పేట డివిజన్‌కు చెందిన వివిధ పార్టీలకు చెందిన యువకులు ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీలో చేరిన ప్రతి ఒక్కరికి అన్ని విధాల అండగా ఉంటానని హామీ ఇచ్చారు. పార్టీ కోసం కష్టపడే ప్రతి కార్యకర్తకు సముచిత గౌరవం కల్పిస్తామన్నారు. కార్పొరేటర్ విజయ్‌కుమార్‌గౌడ్, అంబర్‌పేట డివిజన్ అధ్యక్షులు సిద్ధార్థముదిరాజ్, సాయిబాబా, శ్రీకాంత్, ప్రవీణ్, అషు, సాయియాదవ్ తదితరులున్నారు.

పొదుపు సంఘాల మహిళల చేరిక..

నల్లకుంట: నియోజకవర్గంలో తాను చేపడుతున్న అభివృద్ధి పనులకు ఆకర్షితులవుతున్న వివిధ పార్టీల నేతలు, కార్యకర్తలు స్వచ్ఛందంగా బీఆర్ఎస్‌లో చేరుతున్నారని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ అన్నారు. బీఆర్ఎస్ పార్టీ మైనార్టీ విభాగం నాయకురాలు ఇర్ఫానా సుల్తానా ఆధ్వర్యంలో ఆదివారం నల్లకుంట డివిజన్‌కు చెందిన బీజేపీ బూత్‌లెవల్ మహిళా కార్యకర్తలు, పొదుపు సంఘాలకు చెందిన సుమారు 200 మంది మహిళలు ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. వారందరికీ గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. బీఆర్ఎస్ నాయకులు మేడి ప్రసాద్, గెల్వయ్య పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలతో స్వచ్ఛంద చేరికలు..

ముషీరాబాద్: సీఎం కేసీఆర్ చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్షితులై ఇతర పార్టీల నేతలు స్వచ్ఛందంగా బీఆర్ఎస్‌లో చేరుతున్నారని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. ఆదివారం ముషీరాబాద్ డివిజన్‌లోని బాపూజీనగర్‌లో బీజేపీ పార్టీకి చెందిన నాగ సుదీంద్ర (చిన్న) ఆధ్వర్యంలో బీజేపీ పార్టీకి చెందిన 50 మంది బీఆర్ఎస్‌లో చేరారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. వచ్చే ఎన్నికల్లో కూడా బీఆర్ఎస్ పార్టీ భారీ మెజార్టీతో విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ యువనేత ముఠా జైసింహ, ముషీరాబాద్ డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్ష, కార్యదర్శులు నర్సింగ్‌ప్రసాద్, అరుణ్ కుమార్, వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీధర్‌రెడ్డి, గౌరీశంకర్ ఆలయ కమిటీ చైర్మన్ శ్రీధర్‌చారి, ముచ్చకుర్తి ప్రభాకర్, పార్టీ సీనియర్ నేతలు శివముదిరాజ్, దీన్‌దయాల్‌రెడ్డి, నాయకులు సయ్యద్ అహ్మద్ భక్తియార్, ఎండీ మోహిన్, ఎయిర్‌టెల్ రాజు, శ్రీకాంత్‌గౌడ్, పూసగోరఖ్‌నాథ్, శోభ తదితరులు పాల్గొన్నారు.

కిషన్‌రెడ్డి సారథ్యంలోనే నియోజకాభివృద్ధి



మాట్లాడుతున్న ఉత్తరప్రదేశ్ ఎమ్మెల్యే రాజీవ్ గుంబర్

కాచిగూడ: నియోజకవర్గం కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి సారథ్యంలోనే అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించిందని ఉత్తరప్రదేశ్ ఎమ్మెల్యే రాజీవ్ గుంబర్ అన్నారు. నాలుగేళ్ల బీఆర్ఎస్ పాలనలో అంబర్‌పేటలో అభివృద్ధి కుంటుపడిందని ఆరోపించారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో అంబర్‌పేటలో ఈసారి బీజేపీకి పట్టం కట్టేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని అభిప్రాయపడ్డారు. ఆదివారం బర్కత్‌పురలోని బీజేపీ నగర కార్యాలయంలో బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎన్.గౌతంరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. వారం రోజుల పాటు నియోజకవర్గంలోని బస్తీలు, కాలనీల్లో పర్యటించి ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నానన్నారు. దళిత, బీసీ, మైనార్టీ బంధు పథకాలు కేవలం బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు, నేతలు, మద్దతుదారులకు మాత్రమే ఇచ్చారన్నారు. పార్టీ నేతలు వెంకట్‌రెడ్డి, ఎ.సూర్యప్రకాష్ సింగ్, వనం రమేష్, అజయ్‌కుమార్, నందకిషోర్‌యాదవ్, వినోద్‌యాదవ్, శ్రీధర్, కన్నె ఉమా రమేష్‌యాదవ్, వై.అమృత, పద్మావెంకట్‌రెడ్డి తదితరులున్నారు.

ప్రజాస్వామ్యంలో ఓటుహక్కు కీలకం

ముషీరాబాద్: ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత కీలకమైందని 18ఏళ్లు నిండిన అర్హులైన యువతీయువకులు ఓటు హక్కు నమోదు చేసుకోవాలి ఎమ్మెల్యే ముఠాగోపాల్ అన్నారు. ఆదివారం కవాడిగూడ డివిజన్ బండమైసమ్మ నగర్ చౌరస్తాలో ఓటరు నమోదు కార్యక్రమంలో భాగంగా బీఆర్ఎస్ నేతలు మేకల శ్రీనివాస్‌యాదవ్, సాధుల మహేష్, రాజేష్, వెంకటరమణ, సంతోష్, సురేందర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఓటరు నమోదు కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై ఓటర్లకు దరఖాస్తులను అందజేశారు.

- ఓటరు నమోదు కార్యక్రమాన్ని అర్హులైన ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. ఆదివారం ముషీరాబాద్ బహాదూర్ యార్ జంగ్‌హాల్‌లో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు జావిద్‌ఖాన్, ఇంబ్రాన్‌ఖాన్‌ల సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఓటర్ నమోదు శిబిరాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. బీఆర్ఎస్ యువజన విభాగం నాయకుడు ముఠా జైసింహ, భోలక్‌పూర్ డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు వై.శ్రీనివాస్‌రావు, మున్వర్‌చాంద్, మహబూబ్‌ఖాన్, శివముదిరాజ్, ఇంబ్రాన్‌ఖురేషీ, అశ్వాక్ తదితరులున్నారు.
- అంజుమన్ స్కూల్‌లోని పోలింగ్ బూత్‌లో ఓటర్ నమోదు దరఖాస్తులను మాజీ కార్పొరేటర్ అఖిల్‌ఆమెద్‌తో కలిసి జీహెచ్ఎంసీ అధికారులకు అందజేశారు. సెప్టెంబర్ 15 వరకు ఓటరు నమోదు చేసుకునేందుకు అవకాశం ఉందన్నారు.

మన్‌కీబాత్‌లో పాల్గొన్న బీజేపీ నేతలు

చిక్కడపల్లి: చంద్రుడిపై దక్షిణధృవంపై అడుగుపెట్టిన మొదటి దేశంగా భారతదేశం యెనలేని ఘనత సాధించినందుకు ఇస్రో శాస్త్రవేత్తలకు శుభాకాంక్షలు తెలుపుతూ.. మరింత ప్రోత్సాహాన్ని అందిస్తానని చెప్పడం ప్రధానికి ఉన్న దేశభక్తికి నిదర్శనమని గాంధీనగర్ కార్పొరేటర్ ఎ.పావనీవినయ్‌కుమార్ అన్నారు. ఆదివారం గాంధీనగర్‌లోని 131, 132వ బూత్‌లలో ఏర్పాటు చేసిన మన్‌కీబాత్ కార్యక్రమం 104వ ప్రసంగాన్ని ఆమెతో పాటు బీజేపీ యువ నాయకులు ఎ.వినయ్‌కుమార్‌లు కార్యకర్తలతో తిలకించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. చంద్రయాన్-3 ద్వారా సృష్టించిన చరిత్ర ప్రపంచ దేశాల్లో మన భారతదేశానికి గొప్ప కీర్తిని సంపాదించి పెట్టిందన్నారు. ప్రపంచ దేశాల్లో అగ్రగామిగా నిలిపేందుకు ప్రధానికి ఉన్న చిత్తశుద్ధికి నిదర్శనమన్నారు. ప్రపంచ తెలుగు భాషాదినోత్సవానికి మోదీ శుభాకాంక్షలు తెలుపడం అభినందనీయమన్నారు.



గాంధీనగర్‌లో మన్‌కీబాత్‌ను వీక్షిస్తున్న కార్పొరేటర్ ఎ.పావనీవినయ్‌కుమార్

'మైనార్టీ సంక్షేమం కాంగ్రెస్‌తోనే సాధ్యం'



సన్మానిస్తున్న అంజుమన్ సొసైటీ చైర్మన్ అక్తర్ అలీ

ముషీరాబాద్: మైనార్టీల సంక్షేమం కాంగ్రెస్‌తోనే సాధ్యమని టీపీసీసీ ఉపాధ్యక్షుడు సంఘిశెట్టి జగదీశ్వర్‌రావు అన్నారు. ఆదివారం భోలక్‌పూర్‌లోని అంజుమన్ సొసైటీ, ఆలిండియా స్క్రాబ్ మర్చంట్ అసోసియేషన్ ప్రతినిధులు సంఘిశెట్టి జగదీశ్వర్‌రావును కలిసి మైనార్టీలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ముస్లింల సంక్షేమాన్ని బీఆర్ఎస్ ప్రభుత్వం పూర్తిగా విస్మరించిందన్నారు. కేవలం ఓటుబ్యాంకుగా వాడుకుంటోందని ఆరోపించారు. వచ్చే ఎన్నికల్లో ముస్లింలు బీఆర్ఎస్‌కు తగిన గుణపాఠం చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారని అభిప్రాయపడ్డారు. ముషీరాబాద్ కాంగ్రెస్ టికెట్ స్థానికులకు కేటాయిస్తే మైనార్టీలు అండగా నిలుస్తామన్నారు. ఉపాధ్యక్షులు అభిషేక్‌రెడ్డి, జీ.ఎస్.కేశవ్, సమద్, జీఎస్ చారి, నాగేంద్ర, ఖదీర్ తదితరులున్నారు.

ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి



ముషీరాబాద్: ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని రోటరీ క్లబ్ ఆఫ్ చేంజ్ మేకర్స్ హైదరాబాద్ అధ్యక్షులు మాదాల వంశీకృష్ణ అన్నారు. ఆదివారం కవాడిగూడ డివిజన్ లోయర్ ట్యాంక్‌బండ్‌లోని జలవాయువు టవర్స్ కమ్యూనిటీహాల్‌లో ఉచిత మల్టీస్పెషాలిటీ మెడికల్ క్యాంపు నిర్వహించారు. ఈ సందర్భంగా వంశీ కృష్ణ మాట్లాడుతూ.. ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేస్తూ యువత ప్రాణాల మీదకి తెచ్చుకుంటున్నారన్నారు. ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. డాక్టర్లు కృష్ణమూర్తి, నవీన్‌రెడ్డి, చందన, గాయత్రి, సుమన్, భార్గవి, నితీష్, శ్రీకాంత్, రోటరీ క్లబ్ వైస్ ప్రెసిడెంట్ కిరణ్, సంయుక్త కార్యదర్శి సుమన్ సాయని, డైరెక్టర్లు మీనాక్షిరెడ్డి, దేదీప్య, జలవాయువు టవర్స్ మేనేజ్‌మెంట్ అధ్యక్షులు సురేష్‌రెడ్డి తదితరులున్నారు.